వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

సాగరాలకు సంకటం

సాంకేతికత *విస్ఫోటించి కృత్రిమ మేధస్సు ఊపిరి పోసుకుంటున్న ప్రస్తుత యుగంలోనూ మానవ పరిజ్ఞానం రెండింటి విషయంలో ఇంకా పరిమితంగానే ఉండిపోయింది. అందులో మొదటిది మనిషి మెదడు కాగా, రెండోది సముద్రం. రెండూ లోతైనవి కావడమే అందుకు కారణం కావచ్చు. భూగోళం విస్తీర్ణంలో 71 శాతం సముద్ర జలాలే పరుచుకుని ఉంటాయి. రుతువులు మారడం, ఉష్ణోగ్రత స్థిరీకరించడం, అధిక మొత్తంలో ఆక్సిజన్ సమకూర్చడం విషయంలో సముద్రాల పాత్ర అద్వితీయమైంది. భూగోళం మనుగడలో ఇంత ముఖ్యపాత్ర పోషించే సముద్రం గురించి తెలిసింది చాలా తక్కువే. ఉదాహరణకు సముద్రం అడుగు భాగం మ్యాపింగ్ 26 శాతం మాత్రమే పూర్తయింది. ఇక వాతావరణంపై సముద్రం వేసే ప్రభావం గురించిన పరిశోధనలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. సముద్రంలో ఖనిజాలు, ఇతర వనరుల అన్వేషణ ఇటీవలి కాలంలో కొంత ఊపందుకున్నది. ఈ నేపథ్యంలో సముద్ర శాస్త్రం పురోగతి దిశగా అడుగులు వేసేందుకు ఐక్యరాజ్య సమితి చొరవ తీసుకున్నది. ప్రస్తుత దశాబ్దిని సాగర దశాబ్దిగా ప్రకటించింది. సుస్థిర అభివృద్ధికి సముద్ర శాస్త్రం అనేది దీని లక్ష్యంగా నిర్ణయించింది. మన దేశం ఈ కార్యక్రమంలో భాగంగా ఆర్థిక మండలాల సమీపంలో సముద్రం అడుగు భాగం అన్వేషణలకు 2023లో శ్రీకారం చుట్టింది.*

సుస్థిర అభివృద్ధికి సముద్ర శాస్త్రాన్ని ఆలంబనగా నిలపడం ప్రస్తుత పరిస్థితుల్లో ఓ పెను సవాలుగా మారిందని చెప్పక తప్పదు. అన్వేషణ కన్నా ముందు సంరక్షణ చర్యలు చేపట్టాల్సిన అత్యవసర స్థితి నెలకొన్నది. ఎందుకంటే మహాసాగరాలు ప్రస్తుతం కాలుష్య కాసారాలుగా మారిపోయాయి. రసాయనాలు, ముఖ్యంగా ప్లాస్టిక్ కాలుష్యం ప్రాణాంతకంగా తయారవుతున్నది. సముద్రగర్భం ప్లాస్టిక్‌కు శాశ్వత రిజర్వాయర్‌గా మారిపోయింది. పసిఫిక్‌లో దాదాపు ఫ్రాన్స్ భూభాగమంత సైజులో అతిపెద్ద ప్లాస్టిక్ తెట్టు తేలియాడుతున్నదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఏటా సముద్రంలో 80 లక్షల నుంచి కోటి మెట్రిక్ టన్నుల దాకా ప్లాస్టిక్ వ్యర్థాలు వచ్చిచేరుతున్నాయి. దవాఖానల వ్యర్థాలు, అణు వ్యర్థాలు కూడా అదనంగా వచ్చిపడుతుండటంతో సముద్రాలను కాలుష్యం ఊపిరి సలుపనివ్వడం లేదు. ఫలితంగా సముద్ర జీవులు మనుగడ సాగించలేక సతమతమవుతున్నాయి. ప్లాస్టిక్ వల్ల ప్రభావితమవుతున్న జీవజాతుల్లో 17 శాతం అంతరించే దిశగా పోతున్నట్టు ఐక్యరాజ్య సమితి నివేదిక తెలియజేస్తున్నది. కాలుష్యం కారణంగా సముద్రాల ఉష్ణోగ్రత నిరంతరాయంగా పెరుగుతుండటం మరో సమస్య. దీనివల్ల తుఫానులు, వడగాలుల వంటి తీవ్ర వాతావరణ సమస్యలు తలెత్తుతున్నాయి. 2030లోగా సముద్రాల్లో 30 శాతం విస్తీర్ణంలో రక్షిత వనాల తరహాలో రక్షిత మండలాలను ఏర్పాటు చేయాలని సూచించే ఐక్యరాజ్య సమితి సముద్ర ఒప్పందం వచ్చే ఏడాది (2025) నుంచి అమలులోకి వస్తుంది. అంటే దాని అమలుకు ఐదేండ్ల సమయం మాత్రమే ఉంటుందన్న మాట.

సముద్ర పరిరక్షణ కృషి ప్రధానంగా సాంకేతికత మీదే ఆధారపడతున్నది. సాగర జలాల్లోంచి కార్బన్‌ను వేరుచేసి, తొలగించేందుకు సాంకేతికతను వినియోగిస్తున్నారు. కానీ, జరగాల్సింది మనుషుల లేదా దేశాల ధోరణిలో మార్పు రావడం. భూమి మీద ఇప్పటిదాకా తయారైన ప్లాస్టిక్‌లో వందశాతం యథాతథంగా ఉండిపోయిందనేది గుర్తుంచుకోవాలి. అది కొంత భూమి మీద, చాలావరకు సముద్రాల్లో నిక్షిప్తమై ఉంది. ప్లాస్టిక్ వినియోగాన్ని సున్నాకు తీసుకురావాల్సిన అవసరం ఉంది. ఇది అంత సులభంగా సాధ్యమయ్యేది కానప్పటికీ ఆ దిశగా కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకపోతే మానవజాతి తనకు మాత్రమే కాకుండా యావత్తు జీవకోటికి మరణశాసనం రాసుకున్నట్టే అవుతుంది.

కాళేశ్వరంపై కల్లబొల్లి కబుర్లు

వి.ప్రకాష్

జూలై 15న తెలంగాణ ట్రాన్స్‌కోలో చీఫ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న కె.రఘు, జూలై 16న కేంద్ర జల వనరుల మంత్రి సలహాదారు వెదిరె శ్రీరాం కాళేశ్వరం విచారణ కమిషన్ ముందు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చినట్టు పత్రికల్లో వార్తలు వచ్చాయి. ఆ వార్తల ప్రకారం.. వారు కమిషన్‌కు కొత్త విషయాలు ఏమీ చెప్పినట్టు కనబడలేదు. 2017 నుంచి జేఏసీ ముసుగులో చేసిన వాదనలే రఘు, రెండు నెలల కింద ఒక తెలుగు దినపత్రికలో రాసిన అంశాలనే వెదిరె శ్రీరాం కమిషన్ ముందు ప్రస్తావించినట్టు అవగతం అవుతున్నది. వారు ప్రధానంగా ప్రస్తావించిన అంశాలు నాలుగు.

వాటిలో 1.తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత ఉన్నా.. లేదని కేంద్ర జల సంఘం లేఖ రాసినట్టు తప్పుడు అన్వయం చేసి కాళేశ్వరం ప్రాజెక్టును తెరపైకి తెచ్చారు. 2.తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల ఎఫ్ఆర్ఎల్ వద్ద బ్యారేజీ నిర్మిస్తే గ్రావిటీ ద్వారా నీరు ఎల్లంపల్లికి చేరేవి. అయితే 152 మీటర్ల ఎత్తుకు మహారాష్ట్ర ఒప్పుకోవడం లేదన్న కారణం చూపి బ్యారేజీ నిర్మాణస్థలాన్ని మేడిగడ్డకు మార్చారు. దీంతో ఏటా వేల కోట్ల రూపాయలు కరెంటు బిల్లుల రూపంలో రాష్ట్రంపై ఆర్థిక భారాన్ని మోపారు. 3.డీపీఆర్ లేకుండానే ప్రాజెక్టు పనులకు టెండర్లు పిలిచారు. 4.బ్యారేజీల నిర్మాణంలో ప్లానింగ్ లోపాలు, డిజైన్‌లో లోపాలు, నాణ్యతా లోపాలు, నిర్వహణ లోపాలు ఉన్నాయని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ నిర్ధారించింది.

ఈ అంశాలన్నిటికీ గతంలోనే అనేకసార్లు వివరణలు ఇచ్చినప్పటికీ వారు మళ్లీ మళ్లీ పాత చింతకాయ పచ్చడినే వడ్డిస్తూ ఉన్నారు. పదే పదే అబద్ధాలు ప్రచారం చేస్తే అవే నిజాలై పోతాయన్న గోబెల్స్ సిద్ధాంతాన్ని వారు బలంగా నమ్ముతున్నారని అనుకోవాల్సి వస్తున్నది. వారు ప్రస్తావించిన అంశాలను ఒక్కొక్కటి సంక్షిప్తంగా విశ్లేషిద్దాం. రాసిన విషయాలనే మళ్లీ రాయడం నాకూ విసుగ్గా అనిపిస్తున్నప్పటికీ రాయక తప్పడం లేదు.

1.తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యతపై కేంద్ర జల సంఘం ఏం చెప్పింది?

తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యతకు సంబంధించి కేంద్ర జల సంఘం కాళేశ్వరం ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్‌కు రాసిన లేఖలు రెండున్నాయి. మొదటిది 2015 ఫిబ్రవరి 18న రాసిన లేఖ. రెండవది 2015 మార్చి 4న రాసినది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పంపిన ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టు డీపీఆర్‌ని కేంద్ర జల సంఘంలోని హైడ్రాలజీ డైరెక్టరేట్ వారు పరిశీలించి తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యతపై తమ పరిశీలనలను, సూచనలను చేశారు. 2015 ఫిబ్రవరి 18న ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్‌కు కేంద్ర జల సంఘం రాసిన లేఖలోని పేరా 2లో.. 'నది పర్యావరణ పరిరక్షణ కోసం వదలాల్సిన నీరు పోనూ తుమ్మిడిహట్టి వద్ద నికరంగా లభ్యమయ్యే 160 టీఎంసీల నీటిని ప్రాజెక్టు అవసరాల కోసం వినియోగించే అవకాశం ఉండకపోవచ్చ'ని ఉంది. ఇకపోతే 2015 మార్చి 4న రాసిన లేఖలోని పేరా 3, Combined Yield Series అనే సబ్ హెడ్డింగ్ కింద పేరా 12లో తుమ్మిడిహట్టి వద్ద 75 శాతం విశ్వసనీయతతో లభ్యమయ్యే నీరు 165 టీఎంసీలని పేర్కొంటూనే, అందులో పై రాష్ట్రాలు భవిష్యత్తులో వాడుకునే 63 టీఎంసీలు కలిసి ఉన్నాయని, ఈ 63 టీఎంసీలు ఇప్పుడు కిందకి వస్తున్నాయని, కానీ భవిష్యత్తులో రాకపోవచ్చని స్పష్టంగా పేర్కొన్నది. ఈ మాటలు రాస్తూ ప్రాజెక్టు అధికారులకు తుమ్మిడిహట్టి వద్ద తరలించగలిగే నీటి పరిమాణాన్ని పున:పరిశీలించాలని సూచన చేసింది. తుమ్మిడిహట్టి వద్ద లభ్యమయ్యే నీటి పరిమాణం తగ్గిపోతుందన్న సూచన అందులో ఉన్నది. కాబట్టి భవిష్యత్తులో నికరంగా లభ్యమయ్యే నీరు 165- 63 = 102 టీఎంసీలని స్పష్టం అవుతున్నది. ఇందులో పర్యావరణ ప్రవాహాలు 25 శాతం తీసేస్తే మిగిలేవి 80 టీఎంసీలు. ఇది తుమ్మిడిహట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎఫ్ఆర్ఎల్ వద్ద నిర్మించినప్పుడు మాత్రమే సాధ్యం అవుతుంది. మహారాష్ట్ర 148 మీటర్ల కంటే ఒక్క ఇంచు ఎక్కువకు కూడా ఒప్పుకొనే ప్రసక్తి లేదని అనేక సందర్భాల్లో ప్రకటించింది. 148 మీటర్ల ఎఫ్ఆర్ఎల్ వద్ద 4 మీటర్ల డ్రైవింగ్ హెడ్ తగ్గిపోతుంది. కనుక గ్రావిటీ కాలువలోకి మళ్లించగలిగే నీటి పరిమాణం మరింత తగ్గుతుందని విశ్లేషిస్తే.. ఇది పచ్చి అబద్ధం, తప్పుడు అన్వయమని అంటున్నారు ఈ ఇద్దరు మేధావులు.

ఏపీ ప్రభుత్వం తమతో సంప్రదించకుండా, తమ అంగీకారం లేకుండా ఏకపక్షంగా ప్రాజెక్టు కంట్రోల్ లెవెల్స్, ఇతర సాంకేతిక అంశాలను నిర్ధారించుకొని ముందుకు సాగుతున్నదని, ఈ ఖర్చు అంతా వృథా అవుతుందని అప్పటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి పృథ్వీరాజ్ చవాన్.. ఏపీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డికి ఘాటైన లేఖ రాసిన సంగతి అందరికీ ఎరుకే.

ప్రాణహిత- చేవెళ్లపై అనుమతి కోసం మహారాష్ట్రతో సంప్రదింపులు

ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుకు మహారాష్ట్ర నుంచి అనుమతి సాధించడంలో కేసీఆర్ ప్రభుత్వం విఫలమైందని కమిషన్ ముందు వెదిరె ఆరోపించారు. ఇంతకంటే పచ్చి అబద్ధం మరొకటి ఉండదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాగానే మహారాష్ట్ర ప్రభుత్వంతో ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు అనుమతుల కోసం కేసీఆర్ సర్కార్ సంప్రదింపులు ప్రారంభించింది. అప్పటికి ఇంకా మహారాష్ట్రలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉన్నది. ఆనాటి తెలంగాణ సాగునీటి మంత్రి హరీష్‌రావు ముంబై వెళ్లి మహారాష్ట్ర జల వనరుల మంత్రి ముష్రిఫ్‌ను కలిశారు. ఆయన తమ ప్రభుత్వపు పాత వైఖరినే వెల్లడించారు. అయితే కొద్ది నెలల్లో రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరుగబోతున్నాయి కనుక ఈ తరుణంలో ఈ అంశంపై ఏ చర్చలకూ ఆస్కారం లేదని, ఎన్నికల తర్వాత ఏర్పడే కొత్త ప్రభుత్వంతో చర్చించాలని నిజాయితీగానే చెప్పారు. చేసేదేమీ లేక ఎన్నికలు ముగిసి, కొత్త ప్రభుత్వం ఏర్పాటు

కాళేశ్వరంపై విష ప్రచారం.. అసలు వాస్తవాలు - 1

అయ్యేదాకా వేచి ఉండక తప్పలేదు. మహారాష్ట్రలో దేవేంద్ర ఫడ్నవీస్ నేతృత్వంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటైంది. అప్పుడు ఆ రాష్ట్రంలో మన తెలంగాణ బిడ్డ చెన్నమనేని విద్యాసాగర్ రావు గవర్నర్‌గా ఉన్నారు. తొలుత హరీష్‌రావు మహారాష్ట్ర సాగునీటి మంత్రి గిరీష్ మహాజన్‌తో చర్చించడానికి ముంబై, నాగ్‌పూర్‌కు వెళ్లారు. ఆయనతో పాటు నేనూ వెళ్లాను. తుమ్మిడిహట్టి బ్యారేజీ ఎఫ్ఆర్ఎల్‌పై మహారాష్ట్రను ఒప్పించే ప్రయత్నం చేశారు. అయితే.. 'ఇది నా స్థాయిలో తీసుకునే నిర్ణయం కాదు, ముఖ్యమంత్రుల స్థాయిలో జరగాల్సిన నిర్ణయం' అని గిరీష్ మహాజన్ సెలవిచ్చారు. అదే సమయంలో తెలంగాణ సాగునీటి సలహాదారు దివంగత ఆర్.విద్యాసాగర్ రావు కూడా ఇంజినీర్ల స్థాయిలో ఈ అంశంపై విస్తృతంగా చర్చించారు. ఈ చర్చల్లో కూడా వారు తమ పాత వైఖరిని సడలించలేదు. 2015 ఫిబ్రవరి 17న కేసీఆర్ తన పుట్టిన రోజు వేడుకలను కూడా వదిలేసి మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌తో చర్చలకు ముంబై వెళ్లారు. ఆ సమావేశం గవర్నర్ నివాసంలో ఆయన సమక్షంలోనే జరిగింది. ఆ సమావేశంలో పాల్గొనడానికి కూడా మంత్రి హరీష్‌రావుతో పాటు నేను కూడా వెళ్లాను. తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల ఎఫ్ఆర్ఎల్ వద్ద బ్యారేజీ నిర్మాణానికి ఆమోదం తెలపాలని కేసీఆర్ అభ్యర్థించారు. ముంపునకు గురవుతున్న భూములకు మహారాష్ట్ర నిర్ధారించిన పరిహారాన్ని చెల్లిస్తామని అన్నారు.

జవాబుగా ఫడ్నవీస్ స్పష్టంగా అన్న మాట ఏమిటంటే.. 'కేంద్రంలో కాంగ్రెస్, మహారాష్ట్రలో కాంగ్రెస్, ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడే మహారాష్ట్ర ప్రభుత్వం 152 మీటర్ల ఎత్తుకు బ్యారేజీ నిర్మాణానికి అనుమతించలేదు. ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఉద్యమించి అరెస్ట్ అయిన నేను అనుమతి ఎట్లా ఇస్తాను? బ్యారేజీ ఎత్తును 4 మీటర్లు తగ్గించి, 148 మీటర్ల వద్ద కట్టుకోండి. గోదావరి అవార్డు ప్రకారం మీరు ఎన్ని నీళ్లు తీసుకుపోయినా మాకు అభ్యంతరం లేదు' అని.

నాటి మహారాష్ట్ర గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు సమక్షంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అన్నమాటలు ఇవి. ఇక వారితో సంప్రదింపులు అంటే కాలయాపన తప్ప మరేమీ ఉండదని కేసీఆర్ నిర్ధారణకు వచ్చారు. చర్చలు విఫలమైంది తెలంగాణ ప్రభుత్వ ప్రయత్న లోపం వల్ల కాదు, మహారాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరి వల్లనే. మహారాష్ట్ర సర్కార్ వైఖరి వల్లే చర్చలు ముందుకు సాగలేదు. అనంతరం 2015 మార్చి 4న తుమ్మిడిహట్టి వద్ద భవిష్యత్తులో నీటి లభ్యత అనుమానాస్పదమేనని కేంద్ర జల సంఘం లేఖ రాసిన తర్వాత ఇక మహారాష్ట్రతో ఎఫ్ఆర్ఎల్, ముంపు పంచాయతీ పరిష్కారమైనా ప్రాజెక్టు సాఫల్యతకు అవసరమైన నీటి లభ్యతనే ప్రశ్నార్థకం అయిన పుడు ప్రభుత్వం ఏం చేయాలి? ప్రాజెక్టు సాఫల్యత కోసం ప్రత్యామ్నాయం వెదకాల్సి వచ్చింది. ఆ వెదుకులాటలో దొరికిందే మేడిగడ్డ. ఇది 1990వ దశకంలో గోదావరి జలాల వినియోగంపై ప్రముఖ ఇంజినీర్, ఐక్యరాజ్య సమితి సలహాదారు దివంగత టి.హనుమంతరావు స్టెప్ ల్యాడర్ టెక్నాలజీలో భాగంగా ప్రతిపాదించిన ఏడు వరుస బ్యారేజీల్లో ఒకటైన సూరారం బ్యారేజీ స్థలమే. 152 మీటర్ల వద్ద తుమ్మిడిహట్టి బ్యారేజీని తీవ్రంగా వ్యతిరేకించిన ఫడ్నవీస్ ప్రభుత్వం ప్రాజెక్టును రీ- ఇంజినీరింగ్ చేసిన తర్వాత సానుకూలంగా స్పందించింది. రెండు రాష్ట్రాల మధ్య చరిత్రాత్మకమైన ఒప్పందంపై సంతకాలు కూడా చేసింది దేవేంద్ర ఫడ్నవీస్ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం.

కేంద్ర జల సంఘం హెచ్చరికను పరిగణనలోకి తీసుకోవడం తప్పా?

ప్రాజెక్టు సాఫల్యతకు తుమ్మిడిహట్టి వద్ద భవిష్యత్తులో నికర జలాలు లభ్యం కావని చెప్పిన కేంద్ర జల సంఘం, మేడిగడ్డ వద్ద 284 టీఎంసీల నికర జలాలు ఉన్నాయని చెప్పింది. మేడిగడ్డ స్థలం ఎంపిక నీటి లభ్యత దృష్ట్యా సరైనదేనని కేంద్ర జల సంఘం ధ్రువీకరించింది. నాగార్జున సాగర్ నిర్మించినప్పుడు ఎగువన ప్రాజెక్టులు లేవు కాబట్టి, నీరు ధారాళంగా ప్రాజెక్టుకు చేరుకునేవి. కర్ణాటక తమ వాటా వినియోగం కోసం ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాంలను, మరికొన్ని బ్యారేజీలను నిర్మించడంతో నాగార్జునసాగర్‌కు నీటి ప్రవాహాలు గణనీయంగా తగ్గిపోయాయి. శ్రీరాంసాగర్ పరిస్థితి కూడా అదే. కాబట్టి భవిష్యత్తులో తుమ్మిడిహట్టికి అదే గతి పట్టబోతున్నదన్న హెచ్చరిక కేంద్ర జల సంఘం రాసిన లేఖలో ఉన్నది. ఆ హెచ్చరికను అన్వయించుకోవడం ఈ ఇద్దరు మేధావులకు తప్పుగా కనబడుతున్నది. కేంద్ర జల సంఘం రాసిన లేఖలు రహస్య పత్రాలు కావు. 2018లోనే తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల సంఘం ప్రచురించిన 'తెలంగాణ జీవధార కాళేశ్వరం ప్రాజెక్టు' అనే పుస్తకంలో అనుబంధంగా చేర్చారు. ప్రజలందరూ వాటిని చదివారు. అయినా పాత చింతకాయ పచ్చడినే వీరు మళ్లీ మళ్లీ వడ్డించడమంటే తెలంగాణ ప్రజల విజ్ఞతను పరిహసించే సాహసం చేస్తున్నారనే అనుకోవాలి.

(ఇంకా ఉంది)

(వ్యాసకర్త: తెలంగాణ జల వనరుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్)

కొన్ని సందర్భాలు, కొన్ని ప్రభుత్వాలు, కొంతమంది నాయకుల గురించి చెప్పడానికి ఏ ఉపమానాలూ సరిపోవు. అట్లాంటి సందర్భం మొన్నటి కేంద్ర బడ్జెట్ అయితే, అట్లాంటి ప్రభుత్వం ఎన్డీయే, ఆ నాయకుడు మోదీ. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తెలంగాణపై సవతి తల్లి ప్రేమ చూపిస్తూనే ఉన్నది. రూ.48 లక్షల కోట్ల తాజా కేంద్ర బడ్జెట్‌లో చిల్లిగవ్వ కూడా తెలంగాణకు ఇవ్వకపోవడమే అందుకు నిదర్శనం.

కనికరం లేదు.. కాసు విదిల్చలేదు!

అస్కాని మారుతీ సాగర్
90107 56666

తెలంగాణ ప్రయోజనాలు బీజేపీకి అస్సలు పట్టవు. అలాంటి ఆలోచన రావడం కూడా చాలా పెద్ద తప్పు అనేలా పదేండ్లుగా ఆ పార్టీ నేతలు వ్యవహరిస్తున్నారు. వాళ్లకు తెలంగాణపై ఎందుకంత కోపమో ఇప్పటికీ అర్థం కావడం లేదు. తాజా సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ ఎంపీ సీట్లు రెట్టింపయ్యాయి. అయినా ఢిల్లీ పెద్దలకు తెలంగాణపై కనికరం లేదు. తెలంగాణ అనే ఒక రాష్ట్రం ఉందనే సంగతి వారు మరిచిపోయారు. అందుకే ఒక్క కాసు కూడా విదిల్చడం లేదు.

మోదీ మూడోసారి ప్రధాని అయితే మంత్రి పదవులతో పాటు భారీగా నిధులు తెస్తామని ఎన్నికల సమయంలో బీజేపీ నాయకులు ప్రగల్భాలు పలికారు. వారన్నట్టు రెండు కేంద్ర మంత్రి పదవులు వచ్చాయే గానీ, నిధులు మాత్రం అస్సలు రాలేదు. తెలంగాణ ప్రజల ఆశలు, ఆశయాలు, సమస్యలు, పోరాటాలు, ఆత్మగౌరవ నినాదాల గురించి బీజేపీ నేతలకు బొత్తిగా తెలియదని పదే పదే రుజువవుతూనే ఉన్నది. 'తల్లిని చంపి, పిల్లను బతికించా'రని మోదీ గతంలో అన్నప్పుడు తెలంగాణ ప్రజలకు దాని వెనకున్న ఆంతర్యం అర్థం కాలేదు. అందుకే మూడోసారైనా మోదీ మారకపోతారా? మనకు నిధులు ఇవ్వకపోతారా? అని భావించి బీజేపీకి సీట్లు, ఓట్లు కట్టబెట్టారు. అయితే ఎన్ని ఓట్లిచ్చినా, సీట్లిచ్చినా ఆయన తీరులో మార్పు ఉండదని సవతి ప్రేమతో తేటతెల్లమైంది.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఢిల్లీ పర్యటనలకు శ్రీకారం చుట్టారు. తాము భేషజాలకు పోబోమనే సంకేతాలు ఇచ్చారు. చాలామంది కేంద్ర మంత్రులను వారు కలిశారు. వినతిపత్రాలు ఇచ్చారు. అంతేకాదు, ఏకంగా మోదీని బడే భాయ్ (పెద్దన్న) అని రేవంత్ సంబోధించారు. అయినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో కేసీఆర్ వైఖరి వల్లనే కేంద్రం నిధులు ఇవ్వడం లేదని గతంలో పెద్ద ఎత్తున ప్రచారం చేసినవారికి వాస్తవాలు తెలిసివచ్చాయి.

అసలు విభజన హామీలు అనేవి ఉభయ తెలుగు రాష్ట్రాలకు సంబంధించినవి. కేంద్రంలో భాగస్వామిగా ఉన్నారు కాబట్టి, ఒకరికి న్యాయం చేసి, మరొకరికి తీరని అన్యాయం చేయడం ఎంతవరకు సబబు. అమరావతికి రూ.15 వేల కోట్లు, బీహార్‌కు దాదాపు రూ.59 వేల కోట్లు కేటాయించిన కేంద్రం.. పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసే బాధ్యతను తీసుకున్నది. అయితే తెలంగాణలోని పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు గురించి కనీసం ప్రస్తావించకపోవడం శోచనీయం. అంతేకాదు, బడ్జెట్‌లో బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ముచ్చటే లేదు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి బదులు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పిన ఓవర్ హాలింగ్ వర్క్‌షాప్‌కు కేటాయింపులు లేవు. ఐటీఐఆర్, ఐఐఎం ఊసే ఎత్తలేదు. దీంతో తెలంగాణపై బీజేపీ నాయకులది కపట ప్రేమేనని మరోసారి స్పష్టమైంది.

కేంద్రానికి ఎక్కువ పన్నులు చెల్లిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. పైగా తెలంగాణ మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రం. అందుకే తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టడం ఇష్టం లేకే కేసీఆర్ మూలధనాన్ని పెట్టుబడిగా పెట్టి, సంపద సృష్టి దిశగా అడుగులు వేశారు. ఆ సంపదను ప్రజలకు పథకాల రూపంలో పంచారు. కేంద్రం ఏమీ ఇవ్వకపోయినా ప్రపంచం అబ్బురపడే పథకాలను తీసుకొచ్చారు. సంక్షేమానికి సరికొత్త అర్థం చెప్పారు. ఢిల్లీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ప్రయోజనం ఉండదని తెలిసే కేసీఆర్ తన మార్గంలో తాను వెళ్లారు. ఈ నేపథ్యంలో కేంద్రంపై ఆధారపడటం మానుకొని.. కాంగ్రెస్ పాలకులు కూడా కేసీఆర్ పంథాను అనుసరిస్తూ వనరుల సమీకరణపై, ప్రత్యామ్నాయ ఆర్థిక వనరులపై దృష్టి పెట్టాలి. ■



ఇంగ్లండ్ తరహా పన్నులు.. సోమాలియా తరహా సేవలు!

సాధారణంగా కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడు ఏదో ఒక వర్గం సంతోషిస్తుంది. కానీ, ఈసారి బడ్జెట్‌పై బీజేపీ కార్యకర్తలతో సహా ఎవరూ సంతోషంగా లేరు. మన దేశ ప్రజలు ఇంగ్లండ్ తరహాలో పన్నులు చెల్లిస్తున్నారు. కానీ, సోమాలియా తరహాలో మనకు సేవలు అందుతున్నాయి.

- రాఘవ్ చద్దా, *ఆప్ రాజ్యసభ ఎంపీ*

పోరాటమే తన ఊపిరి

డా.అయాచితం శ్రీధర్
98498 93238

సింగంబాకటితో గుహాంతరమునన్ చేడ్పాటుమై నుండి మా
తంగ స్ఫూర్జిత యూథ దర్శన సముద్యత్ క్రోధమై వచ్చునో
జంగాంతర నివాస ఖిన్నమతి అస్మత్సేనపై వీడె వ
చ్చెం గుంతీ సుత మధ్యముండు సమరస్థేమాభిరామాకృతిన్

ఈ పద్యం తిక్కన రచించిన మహాభారతం (విరాట పర్వం) లోనిది. ఆకలిగొన్న సింహం మనసు వికలమై గుహలో ఉంటూ, ఏనుగుల గుంపును చూసి వాటి మీదికి ఒక్కసారిగా లంఘించినట్లు అజ్ఞాతంలో ఉన్న అర్జునుడు కౌరవసేనపై సమరోత్సాహంతో వస్తున్నాడని ఉత్తర గోగ్రహణ ఘట్టంలో ద్రోణాచార్యుడు దుర్యోధనునితో అంటాడు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా శాసనసభకు బయలుదేరిన కేసీఆర్‌ను దృశ్య మాధ్యమాల్లో చూసినప్పుడు నాకా పద్యం గుర్తుకొచ్చింది. 2001లో జలదృశ్యానికి, 2006లో కరీంనగర్ ఉప ఎన్నికలకు, 2009లో ఆమరణ నిరాహార దీక్షకు బయలుదేరిన కేసీఆర్ జ్ఞాపకాలన్నీ ఒక్కటొక్కటే కండ్లముందు కదలాడాయి. నాలుగు దశాబ్దాలుగా నిరంతరంగా చట్టసభల్లో కొనసాగుతున్న రాజకీయ దురంధరుడు రాష్ట్ర సాధకుడు, రాష్ట్ర మంత్రిగా, కేంద్రమంత్రిగా, ముఖ్యమంత్రిగా అపార అనుభవం గడించిన కేసీఆర్‌పై.. కాలం కలిసిరాక ఒక ఎదురుదెబ్బ తగిలినంత మాత్రాన ప్రత్యర్థులు ఎన్ని అవహేళనలు, ఎన్నెన్ని దూషణలు, ఎన్నెన్ని అభాండాలు వేశారో మనం చూశాం. దురదృష్టవశాత్తు ప్రమాదానికి గురైతే కాంగ్రెస్ నేతలు కనీసం ఆయన వయసుకైనా గౌరవం ఇవ్వకుండా వికృత వ్యాఖ్యానాలు, వికటాట్టహాసాలు చేసి కౌరవ సభను తలపించిన వైనాన్ని తెలంగాణ ప్రజలు ఇంకా మరిచిపోలేదు.

చట్టసభల్లో పాల్గొనడం, ప్రత్యర్థులను ఢీకొట్టడం, ప్రసంగించడం, ప్రతిస్పందించడం కేసీఆర్‌కు ఏదో కొత్త అయినట్టు, ఆయనేదో భయపడుతున్నట్టు బీరాలు పలికిన అంగుష్ఠ మాత్రులకు, అగస్త్య భ్రాతలకు నోళ్లు మూతపడే ముహూర్తం కేసీఆర్ నందినగర్‌లోని ఇంటి గడప దాటిన క్షణంలోనే ఖరారైంది. ఆయనను పాతికేండ్లుగా చూస్తున్న అభిమానులకు తెలుసు. కేసీఆర్ మౌనం ఒక తుఫాను ముందు ప్రశాంతత. కేసీఆర్ అజ్ఞాతం ఒక కురుక్షేత్ర యుద్ధానికి సంకేతం. అది తెలియని అర్భకులు ఇంతకాలం చెలరేగిపోయారు. ఇక ఆట మొదలైంది. పిల్లకాకులకేం తెలుసు ఉండేలు దెబ్బ.

కేంద్రంలో వరుసగా మూడుసార్లు బొక్కబోర్లా పడి, మూణ్నాలుగు రాష్ట్రాలకు పరిమితమై కునారిల్లుతున్న కాంగ్రెస్ ఇవాళ బీఆర్ఎస్‌ను చచ్చిన పాము అని, భూస్థాపితమైందని, ముగిసిన అధ్యాయమని అనడం విడ్డూరం. డజన్ మంది కాంగ్రెస్ ముఖ్యమంత్రులను అందించిన ఆంధ్రప్రదేశ్‌లో అటు అసెంబ్లీలో, ఇటు లోక్‌సభలో వరుసగా మూడుసార్లు గుండు సున్నా తెచ్చుకున్న కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్‌ను వెక్కిరించడం గురువిందను గుర్తుచేస్తున్నది. గతంలో ఓ పెద్దమనిషి తెలంగాణ ఉద్యమం మఖలో పుట్టి పుబ్బలో మాడిపోతుందన్నారు. తానే పక్క రాష్ట్రానికి పలాయనం చిత్తగించారు. ఆయన అనుంగు శిష్యుడికి అదే గతి. కేసీఆర్ రాజకీయ అనుభవమంత వయసు లేని ఈ పిపీలికం గాళ్లు తొడలు చరుస్తుంటే నవ్వొస్తోంది.

కొందరు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బీఆర్ఎస్ నుంచి జారుకోగానే జబ్బలు చరచుకుంటున్న కాంగ్రెస్.. కోడి గొంతు నొక్కి కొత్త పొద్దు ఆగిపోతుందని భ్రమిస్తున్నది. పాతికేండ్ల క్రితం కేసీఆర్ ఒక్కడే ప్రారంభించిన ఉద్యమం ఎన్ని ఆటుపోట్లను ఎదుర్కొన్నా తుదకు విజయం సాధించింది. కేసీఆర్ నినదించిన జై తెలంగాణ బిందువుగా ప్రారంభమై, ప్రవహించి, విస్తరించి, వ్యాపించి ఒక సింధువుగా మారింది. కేసీఆర్ అడుగు నదికి నడకలు నేర్పుతుంది. అడ్డంకులెన్ని ఎదురైనా ముందుకు సాగిపోవడం గమ్యాన్ని చేరుకోవడం దాని సహజ లక్షణం. ఏదేమైనా 2024 జూలై 25 రాష్ట్ర రాజకీయాల్లో ఒక కొత్త మలుపు. కేసీఆర్ చిరకాలం వర్ధిల్లు గాక. శుభమస్తు. విజయోస్తు. ■